# 'అపోలో'లో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్సకు ముందు, అనంతరం

హైదరాబాద్, న్యూస్‌టుడే: బాంబు పేలుడులో ముఖానికి తీవ్ర గాయాలైన ఇరాక్ మహిళకు ఇటీవల జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. దెబ్బతిన్న ముక్కుతోపాటు ముఖం కుడిభాగంలో విరిగిపోయిన ఎముకలను 9 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి సరిదిద్దినట్లు కన్సల్టెంట్ ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్, అపోలో హాస్పిటళ్ల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏస్థటిక్ విభాగాధిపతి డాక్టర్ దేబ్రాజ్ సోమ్ పేర్కొన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. "ఏడాది క్రితం సోఫియా మొహియాదీన్(30) ఇరాక్‌లో జరిగిన బాంబు పేలుడులో గాయపడ్డారు. ఆ ప్రమాదంలో ఆమె కన్ను పూర్తిగా పోయింది. ముఖం కుడిభాగంలో తొమ్మిది ఎముకలు విరిగిపోయాయి. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 18 రోజుల క్రితం సోఫియాకు శస్త్రచికిత్స చేశాం. ఈ తరహా సర్జరీ దేశంలో మొదటిది. దెబ్బతిన్న ఎముకలను టైటానియం ప్లేట్ల సాయంతో బిగించి సరైన స్థితికి తెచ్చాం. కృత్రిమ కన్ను అమర్చాం" అని వైద్యుడు దేబ్రాజ్ సోమ్ చెప్పారు.